# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాల్గవ దశ లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈ నెల 25వ తేదీతో ముగియనుంది.**
2. **ప్రభుత్వాలు ప్రజలకు విద్య, ఆరోగ్యాన్ని ఉచితంగా అందించాలని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు.**
3. **వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈరోజు విశాఖపట్నంలో కొనసాగుతోంది.**
4. **జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్‌కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థిగా ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు.**
5. **ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాల్గవ దశ లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈ నెల 25వ తేదీతో ముగియనుంది. 26వ తేదీన నామినేషన్లను పరిశీలిస్తారు. ఈ నెల 29వ తేదీలోగా తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్మూ కాశ్మీర్‌తో సహా 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 96 లోక్‌సభ స్థానాలకు వచ్చే నెల 13వ తేదీన ఈ దశలో ఎన్నికలు జరగనున్నాయి.

--------------------------

ఈరోజు హనుమాన్ జయంతి సందర్భంగా దేశ ప్రజలకు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హనుమంతుడిని స్మరించుకుంటూ పవన్‌పుత్రుడి అంకితభావం రామభక్తులందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తుందని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. హనుమంతుడి ఆశీస్సులతో భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పం, మరింత శక్తివంతం కావాలని ఆకాంక్షించారు.

--------------------------

ప్రభుత్వాలు ప్రజలకు విద్యా, ఆరోగ్యాన్ని ఉచితంగా అందించాలని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్న సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన

ఒక కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలకు ఉచితంగా ఇచ్చే పథకాలపై ప్రభుత్వాలు పునరాలోచించాలని, ప్రజలు కూడా ఉచిత పథకాలపై ప్రభుత్వాలను ప్రశ్నించాలని అన్నారు. అమలు చేసేందుకు సాధ్యమైన పథకాలను మాత్రమే రాజకీయపార్టీలు తమ మ్యానిఫెస్టోలో చేర్చాలని సూచించారు. ఒక పార్టీకి రాజీనామా చేసిన తర్వాత మాత్రమే వేరొక పార్టీలో చేరే సాంప్రదాయం రావాలని, ఎన్నికలలో గెలుపొందేందుకు తరచూ పార్టీలు మారడం సరికాదని వెంకయ్యనాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈరోజు విశాఖపట్నంలో కొనసాగుతోంది. ఎండాడ నుంచి ప్రారంభమైన యాత్ర మధురవాడ, జోన్నాడ మీదుగా సాయంకాలం చెల్లురు చేరుకుంటుంది. అక్కడ జరిగే బహిరంగ సభలో జగన్మోహన్ రెడ్డి ప్రసంగిస్తారు. ఇలా ఉండగా.. మరోవైపు యాత్రలో భాగంగా ఈరోజు ఆనందపురంలో ఆయన సామాజిక మాధ్యమ ప్రతినిధులతో భేటీ అయ్యారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటసమితి నాయకులతో ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు కర్మాగారం పునర్ వైభవం కోసం తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషిచేస్తోందని తెలిపారు.

---------------------------

జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్‌కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థిగా ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలు నుండి జనసేన కార్యకర్తలు, నేతలతో పిఠాపురంలోని పాదగయ క్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను సమర్పించారు.

---------------------------

ప్రపంచ పుస్తక, కాపీ హక్కుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ "యునెస్కో" ఆధ్వర్యంలో 1995వ సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక, కాపీ హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పుస్తకాలను డిజిటలైజ్ చేయడం వల్ల రచయితకున్న కాపీ హక్కులు హరించిపోతున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా గ్రంధచౌర్యం ప్రబలిపోతున్న నేపథ్యంలో కాపీ హక్కుల పరిరక్షణ చర్యలు చేపట్టడంలో భాగంగా "ప్రపంచ పుస్తక, కాపీ హక్కుల దినోత్సవాన్ని" నిర్వహించాలని యునెస్కో నిర్ణయించింది. యువతలో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంపొదించే కార్యక్రమాలను రూపొందించాలని కూడా యునెస్కో స్వచ్ఛంద సంస్థలను కోరింది.

---------------------------

తిరుపతిలో కోదండరామస్వామి తెప్పోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. తెప్పోత్సవాల్లో రెండో రోజు రామచంద్ర పుష్కరిణిలో స్వామివారు ఏడు చుట్లు తిరిగి భక్తులకు అభయమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు రామనామస్మరణలు చేసుకుంటూ తెప్పలపై విహరిస్తున్న స్వామి వారిని దర్శించుకున్నారు.

---------------------------

రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులకు మే 24వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల కోసం ఈ రోజు నుండి ఈనెల 30వ తేదీలోపు పాఠశాలల లాగిన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చు. కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు.

50 రూపాయల అపరాధ రుసుముతో మే 23వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చు. అలాగే ఒక్కో పేపరు రీకౌంటింగ్‌కు 5 వందల రూపాయలు, రీవెరిఫికేషన్‌కు వెయ్యి రూపాయల ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

-------------------------

జాతీయ స్థాయి లో ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే జెఈఈ మెయిన్ సెషన్-2 పరీక్ష ఫైనల్ 'కీ' ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-ఎన్టీఏ నిన్న విడుదలచేసింది. పది ప్రశ్నలకు 'కీ'లో మార్పులు చేసిన ఎన్టీఏ.. 4 ప్రశ్నలకు సంబంధించి విద్యార్థులకు మార్కులు కలపనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మెయిన్స్ సెషన్-2 పరీక్ష జరుగగా... కటాఫ్ మార్కులు పొందిన 2 లక్షల 50 వేల మందికి జెఈఈ మెయిన్ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసే వీలు కల్పిస్తారు.

-------------------------

ఈరోజు ఆంగ్ల భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. 2010వ సంవత్సరం ఏప్రిల్ 23వ తేదీన మొదటి ఆంగ్లభాషా దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి నిర్వహించింది. ప్రజలకు అర్థమయ్యేలా ఐక్యరాజ్యసమితి అధికారిక భాషల వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. ఆంగ్లభాషలో ప్రఖ్యాత రచయిత విలియం షేక్స్పియర్ వర్ధంతిని పురస్కరించుకుని, ఆయన గౌరవార్థం ఏప్రిల్ 23న ఆంగ్లభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

-------------------------

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికల సంఘం రాష్ట్రంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఓటింగ్ శాతం పెంచడానికి విస్తృత స్థాయిలో చర్యలు తీసుకుంటోంది. ఓటర్లు సులభంగా ఓటు వేయడానికి వీలుగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 46 వేల 165 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. వీటిలో 12 వేల 459 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తించారు. పోలింగ్ నాటికి వారం రోజులు ముందుగా ఓటర్లకు ఓటర్ స్లిప్ లను అందజేయడానికి ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పోలింగ్ పూర్తయిన తమిళనాడు , ఇతర రాష్ట్రాల నుండి భద్రతా దళాలను రప్పిస్తోంది.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు కూడా ఎండ తీవ్రత కొనసాగే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ఈరోజు 43 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 104 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు వీలైనంతవరకు ఉదయం 11 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని సూచించింది.

రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి.శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....18 సెకన్లు....

-------------------------

బాపట్ల జిల్లాలో పోలీస్ శాఖ ఎన్నికల విధులు మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి **"SAMARTH"** యాప్ ను రూపొందించడం జరిగిందని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎన్నికల

రోజున పోలింగ్ కేంద్రాలతో పాటుగా ఇతర ప్రదేశాలలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే ఆ ప్రదేశాలకు దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని శాంతిభద్రతలను పరిరక్షించే విధంగా ఈ యాప్ ను రూపొందించడం జరిగిందని వివరించారు. జిల్లా ఐటి కోర్ విభాగం రూపొందించిన "**SAMARTH**" యాప్ ను అందుకు సంబందించిన పోస్టర్ ను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వకుల్ జిందాల్ మాట్లాడుతూ **SAMARTH** మొబైల్ అప్లికేషన్ ద్వారా జిల్లాలోని హోంగార్డు స్థాయి నుండి అడిషనల్ ఎస్పీ స్థాయి వరకు మొత్తం 2000 మంది పోలీసులకు ఒకేసారి సందేశాలను పంపించే అవకాశం వుంటుందనీ, మొబైల్‌కి ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా నోటిఫికేషన్ ద్వారా సందేశం అందుతుందని వివరించారు.

--------------------------

వై. ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయనీ, చక్కెర నుంచి పెట్రోల్ వరకు సామన్య ప్రజలపై మోయలేని భారం పడుతోందనీ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు.ప్రకాశం జిల్లా సంతనూతలపాడు, తదితర చోట్ల నిన్న జరిగిన ఎన్నికల సభలలో ఆమె మాట్లాడుతూ ..... ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

======================